కథానిక

# అరుంధతి

మల్లెపువ్వులాంటి తెల్లచీర కట్టుకుని అరుంధతి క్లాసుకు వస్తే ప్రతి మగవాడే ఏమిటి, ఆ దారిన పోతున్న ప్రతి ఆడదీ ఒకసారి తల యెత్తి ఆమె అందాన్ని అవలోకించాల్సిందే. ఆ శ్వేత వస్త్ర ధారణంలో ఆమె భూలోకంలోకి దిగివచ్చిన యక్షకన్యలా వుంటుంది. వరూధిని అందం అరుంధతి అందం ముందర తీసికట్టున్నర. అందాల పోటీ పెడితే మొదటి బహుమానం అరుంధతిదే. ఇదంతా చెప్పటంకంటే అరుంధతిని ఒక మొదటి తరగతి హాలీవుడ్ తారతో పోల్చటం సులభం.

సరే, అరుంధతి క్లాసులోకి వచ్చి చూసింది గదా, ఒక్క బ్రహ్మానందరావు మట్టుకు బిక్కు బిక్కుమంటూ క్లాసులో ఒకమూల ఒత్తిగిలి కూచున్నాడు. అసలు బ్రహ్మానందరావు స్వతహాగా మగవాళ్లతో మాట్లాడటానికే సిగ్గుపడే మనిషి. ఇక ఆడవాళ్లను చూస్తే చెప్పాలా!

అరుంధతి అతనివైపు చూస్తూ చాలా సేపు కూచుంది పలకరిస్తాడేమోనని. అతనా పలకటం! మళ్ళా అతనిని పలకరించటానికి పందెం వేయాల్సొస్తుందేమో, అతడే రాజకుమారుడైనా అయినట్టయితే! కనుబొమలు ముడిచేసింది. విసుగు వుంది, ఇంకా ఏమేమో చప్పుళ్లు చేసింది, తన రాక తెలియపరచటం కోసం. బ్రహ్మానందరావు ఆమె వైపు చూడటంలేదు. అరుంధతికి ఆమాత్రం నమ్మకం లేకపోలేదు—అతను తనని చూసినట్టయితే తన అందానికి మేఘంలా తేలిపోయి తప్పక పలకరిస్తాడని.

బ్రహ్మానందరావు యోగసమాధిలో వున్నవాడిలా నిశ్చలంగా కూచున్నాడు. ఆమె చూడకుండా చూద్దామని మెల్లిగా తలెత్తి ఆమెవైపు చూడగానే, చటుక్కున ఆమె ఇటు తిరిగింది. ఇంకేముంది ఇద్దరి కళ్లూ కలుసుకున్నయ్-అతడు వెంటనే బుర్ర అటు తిప్పేశాడు. 'అబ్బ! ఎంత అందంగా వున్నై ఆ కళ్లు నల్లకలువల్లా!' అనుకున్నాడు.

'అహో! ఎంత ఆకర్షణ వుందో ఆ కళ్ళలో, ఎప్పుడూ ఇంతగా చలించలేదు నేను' అనుకున్నది అరుంధతి.

ఇంకా ఇలా అనుకున్నది - 'ఏమిటి ఇంత అందమైనవాడు ఇలా మూంగగా కూచుంటాడే! ఒట్టి అందమైన జంతువు.'

బ్రహ్మానందరావు మాట్లాడకుండా సిగ్గుపడ్డాడంటే అతనిదా తప్పు పాపం - అతను ఇంతవరకూ ఏ ఆడదానితోనూ మాట్లాడలేదు. అందులోనూ అపరిమితమైన సిగ్గు. అంత అందమైనవాడికి ఆపాటి సిగ్గు లేకుంటే ఈపరికి అతను పూర్తిగా చెడిపోయి వుండేవాడు.

ఏమైనా అరుంధతి కూడా అతనిని ఆరోజుకు పలకరించలేదు. అరుంధతి చాలా గర్విష్ఠి. 'మగవాడు ముందు ఉత్సాహం తీసుకోనకపోతే ఆడది ముందు ఎలా పలకరిస్తుంది?' అని ఆమె పట్టుదల.

క్లాక్ టవర్ ముల్లు ఇంకవరకూ ఎన్నోసార్లు రౌండు పూర్తిచేసినై అప్పుడే బ్రహ్మానందరావు రెండు దస్తాల బైండు నోటుబుక్ పూర్తి

"చైతన్య"

చేసి రెండో పుస్తకానికి ప్రారంభోత్సవం చేశాడు. పుస్తకాల్లో రాతలెలా వున్నా వీళ్ళ నుదుటి రాతలు మటుకు అలాగే వున్నై, ఒకరి నొకరు పలకరించుకోకుండా.

నీ అంత అందమైన వాళ్ళు లేరు అంటే అరుంధతి ఉబ్బిపోయి ప్రసన్నమై వరాలు కోరు కోమంటుంది. అరుంధతి దాకా ఎందుకు, అలాటి వాళ్లు ఎంతమంది లేరు? కాని అరుంధతి లోపం ఎక్కడంటే ఆవరం తన శక్తికి మించినదైనా సరే ఇస్తానంటుంది. ఇంతకీ గట్టిగా అడిగితే తేలిగ్గా లొంగిపోయే మనిషి.

ఇటువంటి దుర్బలులకు,ముఖస్తుతులకు లొంగే మనిషి కాదు బ్రహ్మానందరావు. ప్రతిదీ ఆలోచిస్తాడు. తను గట్టిగా నమ్మితే గాని ఏపనీ చేయడు. ఎంతసేపూ మనస్సును అరికట్టడానికీ, జయించడానికీ ప్రయత్నిస్తాడు.

మొదట మొదట అరుంధతి మనస్తత్వం ఎలా ఉండేదంటే తను ఒక గెజిటెడ్ ఆఫీసర్ని, బాగా డబ్బున్నవాడుగా, రెండో పెళ్లి అయినా సరే వివాహం చేసుకొని అథారిటీ చలాయించాలని ఉండేది. అందుకనే స్టూడెంట్సుతో ఎంతో గర్వంగా లక్ష్యపెట్టకండా మాట్లాడేది. అందువల్ల ఆమెకు స్నేహితులు తక్కువయారు.

సాధారణంగా ప్రతి ఆడదానికీ, అందులో ముఖ్యంగా ప్రతి లేడీ స్టూడెంటుకూ, తనచుట్టూ స్టూడెంట్సు అంతా తిరుగుతూ ఉండాలనీ వాళ్ళతో తను పరిహాసాలాడి ఏడిపిస్తూ ఉండాలనీ వుంటుంది.

అటువంటి కోరికే అరుంధతికీ వుంది. ప్రతి నిత్యమూ లక్ష్మి, సీతా, సుశీల వాళ్ళ దగ్గరికి ఎంతోమంది స్టూడెంట్సు వస్తూ ఉండటం, వీళ్ళు కాఫీ తెప్పిస్తానంటే మీకు ఎంత శ్రమవద్దని వాళ్లే కాఫీ టిఫిన్లు తెప్పించడం, చూస్తూవుండేది. వాళ్ళకు తనెందులో తీసిపోయింది? పైగా వాళ్ళందరికంటే అందంగా ఉండే! మరి వాళ్ళందరికీ ఈభోగాలేమిటి, తనకు లేకపోవటమేమిటి? ఇదీ అరుంధతిని పీడిస్తున్న ప్రశ్న.

అరుంధతికి తీరని కోరికలు ఎక్కువ. ఒక్కొకపుడు తను ఆకాశంలో సౌధాలు నిర్మిస్తున్నట్టు, అవి పేకమేడల్లా కూలిపోతున్నట్టు ఊహించుకుని ఖిన్నురాలయేది. అప్పుడు ఆమె హృదయము ఎంతో వేగంగా కొట్టుకునేది, ఇవన్నీ ఎండమావుల్లేనా అని.

రాను రాను అరుంధతి తన అభిప్రాయాలను మార్చుకో ప్రారంభించింది. తన వాంఛలు సఫలీకృతం కావడానికి పట్టుదలతో ప్రయత్నించడం మొదలుపెట్టింది.

ప్రథమంలో తను చేయవలసింది బ్రహ్మానందరావును వశపర్చుకోవడం. తర్వాత తదితర స్నేహితుల్ని సంపాదించటం. వీటిని గురించే ఎక్కువగా ఆలోచిస్తోంది.

అరుంధతితో చిన్నపుడు చదివిన స్నేహితుడు చదువుకు అక్కడకు రావడం, ఆమెను చూడటం తటస్థించింది. కుశల ప్రశ్నలు వేసి పరిచయం వృద్ధిచేసుకున్నాడు. 'అప్పుడప్పుడు కనబడుతో ఉండండి' అని తన అడ్రసు ఇచ్చింది. అరుంధతి కోరితే రావడానికి ఏమిటి – లక్షమంది.

బ్రహ్మానందరావు విషయమే అరుంధతికి ఏమీ తేలలేదు – అతనితో వైరానికంటే స్నేహమే ఆమె మనస్సు సూచిస్తోంది.

'తనే పలకరిస్తే పలకడా ఏమిటి' అని అనుకుంది.

ఆ రోజు క్లాసుకు పది నిమిషాలు ఆలస్యంగా వెళ్లింది. కాని లెక్చరరు రాలేదు. వెంటనే అతన్ని అడిగింది 'ఏమండీ క్లాసు లేదా ఏమిటి' అని.

బ్రహ్మానందరావు మొదట వినలేదు – తల వంచుకుని కూర్చున్నాడు. అరుంధతి కోపం మిన్నుముట్టింది. వెంటనే మళ్లీ 'ఏమండీ మిమ్మల్నే! క్లాసు లేదా అని అడుగుతున్నాను' అంది బిగ్గరగా.

తనని పిలుస్తున్నటు తెలిసింది బ్రహ్మానందరావు కిప్పుడు.

బుర్ర రెండుసార్లు అటూ ఇటూ కంగారుగా ఆడించి 'ఊహూ' అన్నాడు.

పెద్దగా చప్పుడు చేసుకుంటూ కోపంగా వెళ్లిపోయింది అరుంధతి. 'బెల్లం కొట్టిన రాయిలా మాట్లాడ్డేం!' అనుకుంది.

మళ్లీ వారంరోజుల దాకా ఎవరూ మాట్లాడలేదు. అరుంధతి పట్టుదలమటుకు రోజురోజుకూ వృద్ధిచెందుతోంది.

ఈసారి అరుంధతి క్లాసుకు పావుగంట ముందొచ్చి సీటులో కూచుంది అతనికెదురుగా. బ్రహ్మానందరావు కాసేపు మౌనంగా కూచుని బయటకు వెళ్ళడానికి లేవబోయేలోగా కర్కశంగా ఒక ధ్వని వినిపించింది. ఆమె 'మీరేం వెళ్ళక్కర్లేదులెండి, నేనే వెళ్తాను.' అంది అతడు తలెత్తి సాలోచనగా దీనంగా ఆమె కళ్ళల్లోకి చూడటం అదే ప్రథమం. అదీను అనుకోకుండా చూశాడు.

ఆ చూపుల్తో అరుంధతి హృదయం కరిగిపోయింది. 'ఎందుకండీ నేనంటే అంత కోపం మీకు, మాట్లాడరు!' అంది.

'కోపం లేదు కాని అలవాటు లేదు' అని క్లుప్తంగా సమాధానం చెప్పాడు.

'రేపు మీ భార్యతో కూడా మాట్లాడరు కాబోలు' అంది. అరుంధతి చాలా చనువుగా సంభాషణ అల్లుకుపోతుంది, ఒకసారి ఆమెను ఎవరైనా పలుకరిస్తే.

బ్రహ్మానందరావు మాట్లాడలేదు. నిశ్శబ్దంగా నుంచున్నాడు.

'కూచోండి టైమైంది' అన్నది అరుంధతి.

వెంటనే బ్రహ్మానందరావు ఆసీనుడయాడు.

అరుంధతి పెదవులమీద చిన్న మందహాసపు తెలిరేఖ తొలిసారిగా ప్రతిఫలించింది. ఒక్కసారైనా బ్రహ్మానందరావు తనమాట విన్నాడని. అయినా బ్రహ్మానందరావు వాలకం అరుంధతికి నచ్చలేదు. ఒంటరిగా కూర్చుంటాడు, క్లుప్తంగా సమాధానాలిస్తాడు. స్నేహితులు ఎవరూ లేరు. ఏమిటి ఆలోచిస్తాడో ఏమోగాని ఎప్పుడూ విచారంగా వుంటాడు. ఈ ప్రపంచానికి సంబంధించనట్లుగా ప్రవర్తిస్తాడు. తల వంచుకుని అయినా కూచుంటాడు లేకపోతే శూన్యంలోకి చూస్తూనైనా వుంటాడు.

అరుంధతి ఎన్నోసార్లు ఇటువంటి వాళ్ళతో పనేమిటి నాకు అనుకుంది గాని, ఆవిధంగా ఎంతో కాలం వుండలేక పోయింది. బ్రహ్మానందరావు ముఖంలో తేజస్సు, ప్రశాంతత, అరుంధతిని గిలిగింతలు పెట్టేవి. ఈ పరిస్థితుల ప్రోద్బలం వల్ల అరుంధతి బ్రహ్మానందరావును పలకరించక తప్పలేదు. ఆమె బ్రహ్మానందరావునుంచి నిరుత్తరాన్నే ఊహించింది కాని అతనినుంచి సమాధానం రావడంతో అరుంధతి ఆశాలత చిగిర్చింది. దీనితో ఆమె దృష్టిలో పరిస్థితులు ఒక విధంగా అనుకూలంగా తోచినయ్.

బ్రహ్మానందరావును వ్యవధి లేకుండా ప్రశ్నలతో వేధించేది అరుంధతి. అతను అన్నిటికీ సమాధానాలివ్వకపోయినా కొన్నిటికి ఇచ్చేవాడు. రాను రాను ఆమె ఏదైనా అడిగితే ఆమెకళ్ళల్లోకి లోతుగా చూసి, ఆవిధంగా అడగటంలో ఆమె మనస్తత్వాన్ని పరీక్షిస్తున్నట్లుగా, సమాధానమిచ్చేవాడు. ఆ చూపులను అరుంధతి ఓర్చుకోలేక పోయేది.

అరుంధతికి ఇవేమీ అర్థం కావటంలేదు. తనకీ బ్రహ్మానందరావుకీ ఏమిటి సంబంధం! బ్రహ్మానందరావు అలా ఒంటరిగా శూన్య జీవితాన్ని గడుపుతుంటే తనకెందుకు హృదయంలో బాధ? మొదట్లో వారిద్దరిమధ్యా వుండే మౌనం వారిద్దరిమధ్యా ఏదో పెద్ద అగాధాన్ని సృష్టిస్తోందని భావించేది. ఇప్పుడు బ్రహ్మానందరావు స్థితిని చూచి ఏదో బాధ అనుభవిస్తోంది.

బ్రహ్మానందరావుకు సంధ్య చీకట్లలో బీచిలో ఒక్కడూ కూచుని గంభీరమైన ఆ సముద్రపు హోరు వింటూవుండటం పరిపాటి అయింది.

ఒకనాడు మసక మసకగా ఉంది. అప్పుడే చీకటిపడుతోంది. అరుంధతి బీచినుంచి తిరిగి వస్తూ తటాలున ఒకచోట ఆగింది. ఆ మసక చీకటిలో ఎవరో బాహువుల ఆధారంతో వెనుకకు వాలి నిశ్చలంగా కూచున్నట్లు కనిపించింది. సందేహిస్తూ దగ్గరకు వెళ్ళింది.

అరుంధతి ఆకారం గుర్తుపట్టి 'నేను అరుంధతీ! బ్రహ్మానందాన్ని' అన్నాడు.

'ఆఁ మీరా! ఏమిటి ఆలోచిస్తున్నారు ఇక్కడ' అన్నది షాక్ తిన్నదానిలా.

'ఔను. నిన్ను గురించే ఆలోచిస్తున్నాను' అన్నాడు అనకూడదనుకుంటూనే.

తనను గురించే అనగానే అరుంధతికి సంతోషం అతిశయించింది. కాని దుఃఖమూ పొర్లి వస్తోంది.

'ఏమిటాలోచిస్తున్నారు నన్ను గురించి? రోజూ ఇంతేనా? ఇక్కడ బీచిలో ఒంటరిగా కూర్చుంటారే చీకటిపడే దాకా' అన్నది ఎక్కువ సేపు ఓపిక్కపట్టలేక.

'ఔను. నాకది అలవాటే. ఇక్కడకువచ్చిం తర్వాత నన్ను ఇంత ఎక్కువగా పలుకరించింది నువ్వొకదానివే. నిన్ను చూస్తే నిశ్శబ్దంగా ఉండ బుద్ధిపుట్టలేదు. ఎందుకు నిన్ను చూస్తే నా మనస్సు అన్నివిధాల పోతుందో, ఎందుకు నేనంటే నువ్వు అంత శ్రద్ధ తీసుకుంటున్నావో; ఆలోచిస్తున్నాను. నిన్ను చూస్తుంటే...'

ఊం. ఆగారేం చెప్పండి' అన్నది అరుంధతి తొందరపాటుతో, అతని నోటినుంచి ఇంకా ఏమాట వస్తుందా అని దానికి.

'ఆ...ఏమీ లేదు. నిన్ను చూస్తుంటే నాకేదో బాధ, జాలి, కలుగుతుంది' అన్నాడు బ్రహ్మానందరావు.

'సరిగ్గా అదే మీకో అందామనుకుంటు న్నాను' అంది అరుంధతి.

'నేనీ విధంగా వున్నా కూడా నా ద్వారా ఒకరు బాధ పడుతున్నారా?'

'ఔను. పిచ్చివాళ్ళను చూసి జాలిచెందేవాళ్లు లేరూ? అలాగే మిమ్మల్ని చూసి లోకంతో మనకేమిటి అని పోతాడేమిటి, ఈ కాలంలో లోకం అంటే అర్థం చేసుకోలేని ఒక వ్యర్థజీవి పాపం అని అనుకోరూ?' అన్నది అరుంధతి.

'పోనీ అనుకోనీ, ఆకలితో దహించుకు పోతూ శుష్కించిపోయిన శరీరంతో ఎముకలు బయటపడిన ఎంతమంది దీనార్తులను నిత్యం చూసి పాపం, ప్చ్ అని నాలుక చప్పుడు చేసి ఎంతమంది వెళ్ళటం లేదు.'

'అదంతా ఏమిటండీ మరీను. అయినా వాళ్ళతో సామ్యమేమిటి మీకు- తింటానికి తిండి ఉండీ, నూటికి ఏ ఒక్కడికో లభ్యమయే విద్య నభ్యసిస్తూ-'

'అరుంధతీ! పరిస్థితులు అర్థం చేసుకోడానికి మనస్సూ, దయ అలవి సహాయ పడటానికి హృదయం, ఉన్నవాడేమనుష్యుడు- ఇవి ఉన్నా లేనట్టు ప్రవర్తించేవాడు రాక్షసుడు. పొరుగు వాడిని ప్రేమించి సహాయం చెయ్యి. ఇదే ఎవరైనా మానవుడికి ఇవ్వగల సందేశం'

'అయితే ఎవరితోనూ మాట్లాడకండా, ఎప్పుడూ ఒంటరిగా కూచుని ఏమి చేస్తున్నారు మీరు పొరుగు వారికోసం?'

'ఆ ప్రశ్న నీనుంచి వస్తుందనే తలుస్తున్నాను. నేను ఒంటరిగా కూచుని ఎప్పుడూ ఆలోచిస్తూ న్నది దానిని గురించే- ప్రజలు ఇంతమంది బీద వాళ్ళుగా ఉండటానికి కారణం నేడు వారిలో ప్రబలివున్న అవిద్యే కారణం. ప్రజల్ని విద్యా వంతుల్నిగా తయారుచేస్తే సంఘంలో ఉన్న మంచి చెడుల్ని, నేడు వారిని పాలిస్తున్న ప్రభుత్వంలో వున్న లోటుపాట్లను గ్రహించి ముందైనా సరిదిద్దుకుంటారు.'

ఔను, ఇంతవరకూ బాగానేవుంది కాని వాళ్ళు చదువుకోవద్దూ?'

'అక్కడే వుంది మనంలో లోపం. విద్య అంటే ఈనాడు మనం చదువుకుంటున్న కాలేజీ విద్య కాదు. వాళ్లకు బోధించాల్సింది ముఖ్యంగా వాళ్ల దేశం గురించి, తరవాత వాళ్ళదేశంతో పోలిస్తే మిగతా దేశాలవారి సౌభాగ్యాన్ని గురించి. తర్వాత అందరూ సుఖంగా జీవించ టానికి కావలసిన విద్య- ప్రభుత్వాన్ని సక్రమమైన ప్రజాప్రభుత్వంగా తయారు చేయటానికి పనికివచ్చే విద్యగా ఉండాలి, వీరి బాధ్యతలను వీరు గుర్తించి నిర్వర్తించుకునేట్లు చేయాలి.'

'సరే. ఇదంతా ఎవరికి పట్టిందని! అంతా మీ పిచ్చి ఊహాలు తప్ప-'

'అదే నీతో ముఖ్యంగా చెప్పదలచుకున్నది. దీనంతటికీ బాగా చదువుకున్న వారు కొంతమంది త్యాగం చేయాలి ఒక్కొక్క సమయంలో వారి ప్రాణాల్ని సహితం ధారపోయాలి. మనిషికి పట్టుదల ఉంటే ఏపని చేయలేడు? స్వార్థాన్ని జయిస్తే ప్రతి జాతీ ఏమిటి మానవజాతి అంతా బాగుపడుతుంది.'

'ఇప్పటికే ఇలా అయిపోయారని బాధ పడుతుంటే మళ్లీ ఇదొకటి. లేవండి చీకటి పడుతోంది, భోజనం టైమయింది చేనిటూ, మీరటూ వెళ్దాం అన్నది అరుంధతి.

బ్రహ్మానందరావు అసంతృప్తితో లేచి నడక సాగించాడు.

'అయితే వస్తా! గుడ్ నైట్!' అంది.

బ్రహ్మానందరావు నిరుత్సాహంగా ఏదో ఆలోచిస్తూ ఆమె మాట వినకుండానే వెళ్ళిపోయాడు.

'ఛ, ఛ, ఎప్పుడూ ఇంతే. ఏమిటో ఆలోచనలు. ఒక్క నిమిషం ఉత్సాహంగా ఉండను పాపం' అనుకుని అరుంధతి వయసుకు తగ్గ ఆలోచనలతో నడిచి పోతోంది.

'హలో అరుంధతీ! ఇక్కడున్నావా' అని వినబడితే తలెత్తి చూసింది. ఆమె స్నేహితుడు మన్మథరావు. ఏమిటన్నట్లు చిన్నగా నవ్వింది.

'సినిమాకు వస్తావేమోనని హాస్టలుకు వస్తే అక్కడ కాసేపు వెయిట్ చేసినా లాభం లేక పోయింది. అందుకని ఇలా బయల్దేరాను. ఎదురయావు. వెదుక్కుంటున్న తీగ...'

'...కాలికి తగులుతుంది. సరే పద సెకండ్ షోకి వెళ్దాం భోజనం చేసి' అన్నది అరుంధతి, ఎలాగైనా ఖుషీగా సాగా గడపాలని ఆరోజు.

మన్మథరావుకు సంతోషం పట్ట పగ్గాలు లేక పోయింది. అసలు అతను అరుంధతి తనతో కూడా సినిమాకు అంత వెంటనే ఒప్పుకుని వస్తుందని కలలోకూడా అనుకోలేదు. ఎన్నాళ్ళనుండో ఉన్న కోరికలన్నీ నెరవేరుతున్నట్లు వూహించుకుని ఆనందిస్తున్నాడు.

ఒక అరగంటలో ఆహారం తీసుకుని మరోక అరగంటలో శుభ్రంగా టాయిలెట్ అయి వచ్చింది అరుంధతి. అరుంధతి కోసం కాచుకుని ఉన్నాడు మన్మథరావు సిగరెట్టుమీద సిగరెట్ కాల్చిపారేస్తూ.

'మరేమీ అనుకోవుకదూ, చాలా సేపైందని' అన్నది అరుంధతి సానునయనంగా.

'ఎంత మాట - అమాత్రం ఆలస్యం కాదా ఏమిటి ఆడవాళ్లు బయల్దేరితే. ఇంకా నువ్వు నయం, చాలా తొందరగా వచ్చావు' అన్నాడు మన్మథరావు.

'సరే! ఇంతకీ ఏ సినిమాకు వెళ్దాం?' అన్నది.

'నువ్వు చెప్పు దేనికి వెళదామో, ఉన్న సినిమాలు ఇవి: లే మిజరబు లే, వన్ టచ్ అఫ్ వీనస్, ఆలివర్ ట్విస్ట్, చార్ దిన్, మొదటి రాత్రి.'

'వన్ టచ్ అఫ్ వీనస్, చార్ దిన్, మొదటి రాత్రి,ఈ మూడూ వెళ్ళతగినవే. దేనికి వెళ్దామో నువ్వే చెప్పు' అన్నది అరుంధతి.

'అయితే మొదటి రాత్రి' అన్నాడు మన్మథరావు.

'ఒప్పుకున్నాను' అన్నది అరుంధతి.

ఇద్దరూ మెల్లగా నడిచి థియేటరుకు చేరారు. అరుంధతి డబ్బు తీసి ఇవ్వబోతుండగా మన్మథరావు 'డబ్బు పెట్టుబడి పెట్టడానికా నిన్ను తీసుకుని వచ్చింది! ఆమాత్రం లేనివాణ్ని కాదు' అని వెళ్ళి టికెట్లు తీసుకుని వచ్చాడు.

'ఏమీ అనుకోకేం. నీ డబ్బు పెట్టడం ఎందుకని తీసిచ్చాను అంతే' అన్నది.

మన్మథరావు మామూలుగా కష్టపడకుండా కూచుని తినడానికి చాలినంత డబ్బు కలవాడు. అయినా వేషం భాషలు చూస్తే పెద్ద ధనవంతుడి మల్లే కనబడతాడు.

అరుంధతికి డబ్బూ వుంది, వేషమూ వుంది. ఎప్పుడూ మనస్సును నిర్మలంలా, సంతోషంగా వుంచడానికి ప్రయత్నిస్తుంది. చెడును ఎదుర్కొని మంచిదారులని స్వీకరించటానికి ప్రయత్నిస్తుంది. గొంతుమీదకు వచ్చేదాకా అలక్ష్యం. అక్కడనుంచిగాభరాపడి ప్రమాదాన్ని తప్పించుకోడానికి నానా అవస్థాపడి ఎట్లా అయితేనేం పైకి తేలుతుంది.

ఫస్టు షో వదలగానే ఇద్దరూ వెళ్ళి ముందు కూచున్నారు. క్రమక్రమంగా అంతా నిండి పోతోంది హాలు. వీళ్లిద్దరూ బాహ్య ప్రపంచమే మరచిపోయి మాట్లాడుకుంటున్నారు. ఇంతలో ఆట ప్రారంభమయింది.

మన్మథరావు ఆమె ఊహాల్ని రెచ్చగొట్టే ప్రేమ కథలు చెబుతున్నాడు. ఒక్కొక్కచోట సినిమా సంఘటనలను వర్ణిస్తూ, వాటిలో ఉన్న భావాలను విపులీకరిస్తూ, ప్రేమమీద ఉపన్యాసాలు దంచేస్తున్నాడు. అయినా మన్మథరావు ననవలసిన పనిలేదు. ఈ కాలంలో అందమైన ఆడది తనంటతాను వచ్చి పక్క కూచుని పలకరిస్తుంటే ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని వారెవరు?

అరుంధతి ఎంతో చనువుగా ఆప్యాయంగా మాట్లాడుతోంది. అలాగే మన్మథరావు కూడా స్వతంత్రం తీసుకుని ఆమె బుగ్గలను అప్పుడప్పుడు చూపుడు వేలుతో పొడుస్తున్నాడు-

ఇంటర్వల్ అయింది. 'అటు కాస్త తిరిగి కాఫీ తాగివద్దాంరా' అన్నాడు మన్మథరావు.

అరుంధతి వెంటనే అతన్ని అనుసరించింది-

ఇద్దరూ సమీపంలో వున్న హోటలుకు వెళ్ళి కాఫీ తీసుకున్నారు. 'మళ్ళీ ఈ మూడు మైళ్లూ నడిచి హాస్టలుకేం వెడతాం, ఈ రాత్రి ఇక్కడ రూము తీసుకుందామా!' అని అడిగాడు.

'వద్దు బాబూ నాకు భయం అలా వుండట మంటే' అన్నది.

'నే నుండగా నీ కెందుకు భయం? రూము తీసుకుంటా' అని మానేజరు దగ్గరకు వెళ్ళి డబ్బు యిచ్చేసి రూము మాట్లాడాడు.

మానేజరు అరుంధతి వంక అదో విధంగా చూశాడు. హోటలులో సర్వర్స్ అంతా అరుంధతివైపే చూస్తున్నారు. వారి చూపుల్ని భరించలేక పోయింది అరుంధతి. తను అవమానింప బడుతున్నట్టనిపించింది. మెల్లగా మన్మథరావు వెనకాల తలవంచుకుని నడుస్తోంది. మళ్ళీ ఇద్దరూ హాలు చేరుకున్నారు. అప్పుడే చాలా సేపైపోయింది, పిక్చర్ మొదలెట్టి ఇద్దరూ ఒకమూల కూర్చున్నారు.

హాలులోకి రాగానే అరుంధతి తేరుకుంది. మళ్లీ మామూలుగా కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు-పక్కన ఉన్నవాళ్లు ఒకటి రెండు సార్లు, స్! అనీ సైలెన్స్ ప్లీజ్., అన్నా కూడా లక్ష్యపెట్టకుండా మాట్లాడుకుంటున్నారు.

'అవునుగాని బ్రహ్మానందరావు మీ క్లాసు మేటా!' అని అడిగాడు మన్మథరావు.

'ఔను. అతన్ని గురించి ఏం!' అన్నది అరుంధతి.

'ఆ, ఏమీ లేదు. ఎప్పుడూ ఒంటరిగా ఎవ్వరితో మాట్లాడకుండా కూచుంటాడు కదూ. నీతో మాట్లాడతాడా?'

'ఆ నాతో చాలా బాగానే మాట్లాడతాడు-పాపం చాలా మంచివాడు.'

'అనుకున్నావు గబోల్ను. పైకిఅలా అమాయకులుగా ప్రవర్తించే వాళ్లే కొంప లార్పుతారు. కొంపతీసి అతన్ని నమ్మేవు? అతనిలో ఎంత కక్ష్య వుంది! ఎందుకైనా దూరంగా ఉండటం మంచిది-ఎంతో రిజర్వుడుగా ఉన్నట్టు నటిస్తాడు—అదో ఆకర్షణ అనుకున్నాడు నీలాంటి వాళ్లను దగ్గరకు లాగటానికి-పైకి ఎంత త్యాగా కబుర్లు చెపుతాడనుకున్నావు' ఎంతో ఈర్ష్యతో ఆమెలో ఒక విధమైన హేయ భావాన్ని కల్గించాడు బ్రహ్మానందరావుమీద మన్మథరావు.

దూరాలోచన లేకపోబట్టిని గనుక, తొందర మనిషి గనుక, అరుంధతి ఇదంతా నమ్మింది. 'అమ్మ! వెధవలు, పూసరవెల్లి మల్లే ఎన్ని రంగులు మారుస్తారు!' అని ఎంతో ఆశ్చర్యపడ్డది అరుంధతి.

షో విడవగానే ఇద్దరూ రూముకు బయల్దేరారు.

'చూశావా ఆ వెధవని' అన్నాడు మన్మథరావు బ్రహ్మానందరావును చూపిస్తూ.

బ్రహ్మానందరావు తల వంచుకుని వెడుతున్నవాడల్లా తలెత్తి ఒకసారి అరుంధతిని, మన్మథరావును హోటలులోకి వెళ్ళడం చూశాడు. మళ్ళీ యథాప్రకారంగా తలవంచుకుని నడచిపోతున్నాడు.

* * *

గాలి హోరున వీస్తోంది. నల్లని మేఘాలు దట్టంగా ఆకాశాన్ని కమ్ముకుంటున్నయ్-తుపాను సూచనలు కనబడుతున్నాయ్-అరుంధతి ఒంటరిగా గదిలో కూర్చుని ఏదో ఆలోచిస్తోంది-అప్పటిదాకా ఆమె కళ్ళల్లో మేఘాలు నిండి వర్షించినై. ఆ నీరు ఆమె చెక్కిళ్ళమీదుగా పారి సగం దిండును తడిపేసినై. ఆమె చేతిలో ఏదో కాగితం వుంది. ఆమె దాన్ని చదువుతోంది మళ్లీ మళ్లీ—

ప్రియమైన అరూ:

ఆ నాడు నేను వెలిబుచ్చిన భావాలను, ఉద్దేశాలను నిజం చేయడంకోసం నేను కొంతకాలం పాటు నా మనస్సును కుదుటపర్చుకుని విశ్రాంతి తీసుకోనడానికై ఈ లోకంతో సంబంధం లేకుండా దూరంగా ఉన్న ఒక ఆశ్రమానికి చేరాను. మన్మథరావుతో నువ్వు అన్యోన్యంగా వుండటం తెలిసింది. అతను మంచి వాడని తలుస్తాను. అయినా నీ వల్లనైనా మంచిగా మారవచ్చును. భార్యాభర్తల మనస్సులు కలిసినపుడే అది సుఖమైన ఆనందమైన వివాహం అంటానికి వీలు పడుతుంది. అటువంటి వివాహం కేవలమూ ఒక అదృష్టం. అందుకనే ప్రేమించి పెళ్ళిచేసుకో మంటారు. ఇది నీ విషయానికి అనువర్తిస్తుంది గనుక నీ జీవితం ఆనందంగా వుంటుందని ఆశి

స్తాను. నీ వొక్కదానివే నన్ను ఎంతో ప్రేమతోనూ అప్యాయంగానూ పలకరించి నా కష్టసుఖాలను తెలుసుకునే దానివి. నాకున్న ఈ సిగ్గువల్ల మొదట నీతో మాట్లాడకుండా ఎంతో కష్ట పెట్టాను. నాకు తెలియకుండా చేసిన తప్పులను క్షమిస్తావని తలుస్తాను. నా ఆదర్శాలను తృణీకరించక నీ చేతనైనంత వరకూ నీ పొరుగు వారికి సహాయపడతావని ఆశిస్తాను - నా కోసం అనవసరంగా ఆరాటపడవద్దు.

ఇట్లు,

శాంతి ఆశ్రమము. బ్రహ్మానందరావు.

ఇది చదువుతున్నంతసేపూ ఆమె కన్నులనుంచి బాష్పవర్షం కురుస్తూనే వుంది. ఏదో ఆలోచించి ఒక్కసారిగా పక్కమీద నుంచి లేచి కన్నులు తుడుచుకుని బయటికి వెళ్ళి, నడవడం ప్రారంభించింది.

'ఎక్కడకండీ అమ్మగారూ! బండి కావాలా?' అన్న జట్కావాడు బండి తెచ్చి 'ఎక్కండమ్మ గారూ' అన్నాడు.

వెంటనే బండి ఎక్కి 'శాంతి ఆశ్రమానికి పోనీయవోయ్' అంది.

దాదాపు ఒక గంట ఆ గతుకుల రోడ్డు మీదుగా నడిచి బండి ఒక చిన్న డాబాముందు ఆగింది. అరుంధతి బండిదిగి 'శాంతి ఆశ్రమము' అన్న బోర్డు చూచి గబగబా లోపలకు వెళ్ళింది.
ఎవరో ఒక సాధకుణ్ణి చూసి 'బ్రహ్మానంద రావుగారు ఇక్కడ వున్నారా అండీ' అని అడిగింది.

'లోపల వున్నాడు. అలా కూచో అమ్మా పిలుస్తాను. అదేమిటీ గుడ్డలన్నీ తడిసి పోయినై ధోవతి వుంది కట్టుకుంటావా' అని అడిగాడు.
'వద్దు ..వద్దు' అన్నది చలితో వణుకుతూ

సాధకుడు లోపలకు వెళ్ళిన ఐదు నిమిషాలకు సన్యాసి వేషంలో బ్రహ్మానందరావు వచ్చాడు.
'అరుంధతీ' అనే లోపలే అరుంధతి బ్రహ్మానంద రావు కాళ్ళమీదపడి క్షమించమని ప్రార్థించింది.
'అరూ! ఇందులో నీదేం తప్పు వుంది? క్షమించటం దేనికి? లే, ఎందుకు వచ్చావు' అని ఆశ్చర్యంతో అడిగాడు.
అరుంధతి బ్రహ్మానందరావు ప్రశాంతమైన ముఖంలోకి ఒకసారి చూసి తల దించేసుకుని చెప్పడం మొదలు పెట్టింది-
'ఆనంద్! ఆ రోజు మన్మథరావుతో నీకు హోటలు దగ్గర కనిపించిన తర్వాత మేమిద్దరం అతను తీసుకున్న రూములోకి వెళ్ళాం. అంతవరకూ స్నేహితుడు లాగానే ప్రవర్తించి నీ మీద అసూయను కలుగజేసిన మన్మథరావు ఆ రూములో నన్ను ఒంటరిగా చూసి నన్ను ప్రేమిస్తున్నానని ఇంకా ఏమేమో... నేను తిరస్కరించాను. స్నేహితుడివి అని నమ్మి వచ్చానన్నాను. అయినా అతను నన్ను బలాత్కరించటానికి ప్రయత్నించాడు. గోల చేశాను. కేకలువేశాను చప్పున నా నోరుమూసి బలత్కరించే సమయంలో వాళ్ళ ధర్మమా అంటూ హోటలు మానేజరు, సర్వర్సు వచ్చి అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించి హాస్టలు దాకా వచ్చి నన్ను దింపారు. అతని మాటలు నమ్మి నిన్ను అనవసరంగా తిరస్కరించాను నన్ను క్షమించు ఆనంద్ - నిన్ను ప్రేమిస్తున్నాను - నీ హృదయంలో నన్ను దాచుకో ఆనంద్ - నా తప్పులన్నీ క్షమించవూ' అని ప్రాధేయ పడుతోంది అరుంధతి.

'బ్రహ్మానందరావు కన్నులనుంచీ నీళ్ళు బొట బొట కారుతున్నయ్

'అరూ! నిన్ను ప్రేమిస్తున్నాను - ఎప్పుడూ నిన్ను ప్రేమిస్తాను .. కాని మన ప్రేమకు భౌతికమైన శరీర వాంఛ లేదు ఎప్పుడూ నా హృదయంలోనే వుంటావు నువ్వు - ఇద్దరం సంఘసేవ చేద్దాము.'

'వద్దు ఆనంద్! మనకా భావకవిత్వం వద్దు మన మిద్దరం అందరు మానవుల్లాగే జీవిద్దాం - అలాగే ప్రేమించుకుందాం. వేదాంతంలో పడిపోకు ఆనంద్!'

'నువ్వు నాకు దక్కకపోవటంవల్లనే నేను ఆశ్రమానికి వచ్చాను అరూ! నువ్వే నన్నంగీకరిస్తే నాకింకేం కావాలి! మనిద్దరి దాంపత్య జీవితం ఎంత ఆదర్శంగా ఉంటుంది!' అన్నాడు బ్రహ్మానందరావు, గద్గదికతతో.

నీటితో నిండిన అరుంధతి కళ్ళకి లోకమంతా, ఆ క్షణాన వెన్నెలమయంగా కనబడింది.